క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీ నగర్, గ్రీన్‌విచ్, ప్రెస్టైజ్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు మానసాహిల్స్, మానస వ్యాలీ, గాంధీ నగర్ విలేజ్, సోడమ్మ దేవాలయం, కొత్వాల్ గూడ ఫైల్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సజారహోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నౌనెంబర్, జలాల్‌బాబానగర్, హిమద్‌నగర్, హెచ్‌హెచ్ ఫార్చ్యూన్, హరినాథ్‌రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందన్నారు.

నేడు ఓటు నమోదు చేసుకోండి

మణికొండ: గండిపేట మండల పరిధిలోని అన్ని పోలింగ్‌బూత్‌లలో శని, ఆదివారాల్లో కొత్త ఓటర్ల నమోదు, తప్పులను సరిచేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కలగజేస్తుందని, ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌ల వద్ద (ప్రభుత్వ పాఠశాలలు) బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఫాం-6, ఫాం-8లు అందుబాటులో ఉంటాయని మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

రాజేంద్రనగర్: దేశంలోని అన్ని రాష్ట్రాలకు సీఎం కేసీఆర్ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 170 మంది ఆడ పడుచులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల సీఎంలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ సాహిత్య సమావేశాలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠం శారదాధామంలో రెండ్రోజుల సాహిత్య సంగోష్టి (చర్చ కార్యక్రమం) నిర్వహిస్తున్నట్లు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. భారతీయ దృక్కోణంలో ఆధునిక సాహిత్యం అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు 26,27న ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భాషావేత్తలు, సాహిత్య వేత్తలు పాల్గొంటారన్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పరిశ్రమపై దాడి

రాజేంద్రనగర్: కల్తీ అల్లం, వెల్లులి పేస్ట్ తయారుచేస్తున్న గోదామ్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నిర్వాహకుడితో పాటు 4 టన్నుల అల్లం, వెల్లుల్లి పేస్ట్, రసాయన డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. ఉప్పర్‌పల్లికి చెందిన బబ్లూ అనే వ్యక్తి గత కొంతకాలంగా అల్లం,వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తూ.. హోల్‌సెల్‌గా విక్రయిస్తున్నాడు. అలుగడ్డ, క్యాబేజీలతో పాటు రసాయనాలను కలిపి ఈ పేస్ట్‌ను తయారు చేస్తున్నాడని సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి కల్తీపేస్ట్‌ను స్వాధీనం చేసుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

వరలక్ష్మి దేవీ నమోస్తుతే

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో వరలక్ష్మి వ్రతాలను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా ప్రతినిధులు, తమ ఇళ్లల్లో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి ముత్తైదువులకు వాయినాలను ఇచ్చుకున్నారు. భక్తులు తమ కుటుంబాలను చల్లగా చూడాలని వరలక్ష్మి అమ్మవారిని వేడుకున్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



మణికొండలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు



ప్రత్యేక అలంకరణతో..



గాలిదొడ్డిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళ

పట్టణ ప్రగతితో గ్రామాల అభివృద్ధి

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పట్టణ ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర వెల్లడించారు. శుక్రవారం రెవెన్యూశాఖ నుంచి వీఆర్‌ఏలుగా బదిలీ అయి మున్సిపల్‌శాఖ, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు మున్సిపల్ కమిషనర్లు పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

ప్రతి నెల వచ్చే పట్టణ ప్రగతి నిధుల ద్వారా నగరంలో పలు మౌలిక సదుపాయల రూపకల్పనపై కమిషనర్ వివరించారు.

శుభాకాంక్షల వెల్లువ



మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మణికొండ నాయకులు



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నేతలు

మణికొండ: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యేగా టికెట్‌ను దక్కించుకున్న పైలెట్ రోహిత్‌రెడ్డిలకు నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు యాదగిరి, బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీరాములు, బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్లు శివారెడ్డి, వసంత్‌రావు, నాయకులు గోపాల గణేష్, విశ్వనాథ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ రోహిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, శ్రావణ్ కుమార్, జి.నరేందర్, జి.రాఘవేందర్ తదితరులున్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అర్చన



పనులను ప్రారంభించిన కౌన్సిలర్ నాగపూర్ణశ్రీనివాస్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. శుక్రవారం అత్తాపూర్‌లో జరుగుతున్న సీసీరోడ్డు పనులను ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, అత్తాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు రాములు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం..

మణికొండ: మంచిరేవుల గ్రామంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని అభివృద్ధి చేస్తామని కౌన్సిలర్ నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆమె తన వార్డు పరిధిలో రూ.15 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంచిరేవులలో కాలనీలు విస్తరించటంతో పాటు జనాభా పెరుగుతోందన్నారు. గతంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో ఆధునీకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయించానన్నారు. శ్రీరాములు, శశి, కిరణ్, సంతోష, రాజు, వినయ్, సత్తయ్య, చిన్న, రమేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంజీఐటీలో అలుమ్ని మీట్

మణికొండ: ఎంజీఐటీ కళాశాలలో శనివారం సాయంత్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం (అలుమ్ని మీట్) నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులతో పాటు కళాశాల చైర్మన్ డి. ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

27న పెరిక కులస్తుల భవనానికి శంకుస్థాపన

మణికొండ: కోకాపేటలో పెరిక కులానికి కేటాయించిన రెండెకరాల భూమిలో నిర్మించే ఆత్మగౌరవ భవనానికి ఆదివారం ఉదయం 7గంటలకు శంకుస్థాపన, మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్ తెలిపారు. సభాధ్యక్షుడిగా కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, గౌరవ అతిథులుగా మంత్రులు టి. హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి. శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెరిక కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పనులు సకాలంలో పూర్తిచేయాలి

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాకపోతే అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని అలహస్‌నాత్ కాలనీ, నిజాం కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన క్రికెట్ మహ్మద్ సిరాజ్ ఇంటి లెన్ ముందు జరుగుతున్న బాక్స్ టైప్ డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఆయన అక్కడ ఉన్న అధికారులపై మండిపడ్డారు. పనుల్లో నాణ్యత లోపిస్తే బాధ్యత ఎవరిదని ఆయన అన్నారు. గంటసేపు వర్షం కురిస్తే మిలట్రీ ఏరియా నుంచి అలహస్‌నాత్ కాలనీ మీదుగా నిజాం కాలనీ గూండా టోలిచౌకీ వద్ద చేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా డీఈఈ రామకృష్ణ, ఏఈ వెంకటశేషయ్య, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్‌ఫరాన్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి పైపులైన్ పనులను ఆధునీకరిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కాశీకానగర్, మల్లికార్జుననగర్, ఎన్.ఎఫ్.సీ. కాలనీలో తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సాగర్‌గౌడ్ హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు నూతన పైపులైన్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా మండలి మేనేజర్ రాజ నరేంద్ర, కాలనీవాసులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్

పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇవ్వాలి



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న సినీహీరో సుమన్

మణికొండ: ఆత్మరక్షణ, ఆరోగ్యానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి పాఠశాలలో వారంలో రెండ్రోజులు కరాటేలో శిక్షణ ఇవ్వాలని సినీనటుడు సుమన్ అన్నారు. జాతీయ ఓపెన్ కరాటే కుంగ్‌ఫు చాంపియన్ షిప్- 2024, సుమన్ శోటోకాన్‌కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో రెండ్రోజులుగా పోటీలను నిర్వహించారు. విజేతలకు మణికొండ కేఎస్ గుప్తా గ్రూప్ ఆఫ్ హోటల్స్‌లో శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరాటే నేర్చుకోవటం ద్వారా ముఖ్యంగా బాలికలు ఆత్మవిశ్వాసంతో ఉండొచ్చన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పాఠశాలల్లో కరాటే శిక్షణ గురించి ఆలోచించాలని సూచించారు.

పాదచారులకు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు



సిగ్నల్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ మురళీకృష్ణ



రోడ్డు దాటుతున్న పాదచారులు, ట్రాఫిక్ పోలీసులు

రాజేంద్రనగర్: రోడ్డును దాటేందుకు పాదచారుల కోసం సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ అన్నారు. రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి వద్ద ఇన్‌స్పెక్టర్ బోస్‌తో కలిసి సిగ్నల్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరాంఘర్ నుంచి అత్తాపూర్ వరకు ఉన్న ప్రధాన రహదారి రద్దీగా మారిందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయన్నారు. రోడ్డు దాటేందుకు పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆరాంఘర్ నుంచి అత్తాపూర్ వరకు రోడ్డు దాటేందుకు 8 పాదాచారుల సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సిగ్నల్స్ వద్ద జీబ్రాలైన్ ఏర్పాటు చేశామని పాదాచారులు రోడ్డును దాటేందుకు దీనిని ఉపయోగించాలని కోరారు. దీని ద్వారా ప్రమాదాల నివారణతో పాటు వృద్ధులు, పిల్లలు, మహిళలు రోడ్డు దాటేందుకు సులభంగా ఉంటుందన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు

శంషాబాద్: నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ తనతో పాటు ఇతర వ్యక్తులకు టికెట్ కేటాయించినా.. చిత్తశుద్ధితో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు.



గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్న పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్

ప్రకాష్‌గౌడ్‌కు ప్రత్యర్థులెవరో ?

- నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ
- ఎంఐఎం పోటీలో ఉండేనా..



ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్

మణికొండ: రాజకీయాలు, ఎన్నికలు అనగానే ఎవరికి, ఎవరు ప్రత్యర్థులు అనే విషయం ముందుగా చర్చకు వస్తుంది. రాష్ట్రంలో గత 9 ఏళ్లుగా బీఆర్‌ఎస్‌పార్టీ అధికారంలో ఉంది. నియోజకవర్గానికి మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ విజేతగా నిలిచిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు నాల్గోసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు మరోసారి పార్టీ అవకాశం ఇచ్చింది. సీఎం కేసీఆర్, పార్టీ అధినేత ప్రకటించిన 115 మంది జాబితాలో ప్రకాష్‌గౌడ్‌కు స్థానం దక్కిన విషయం తెలిసిందే.

◆ ఎన్నికలకు ఇంకా నాలుగు నెలల సమయం ఉండగానే అభ్యర్థులను ప్రకటించి అధికార పార్టీ ఎన్నికల దూకుడును పెంచింది. దీంతో ప్రస్తుతం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రకాష్‌గౌడ్‌తో తలపడే కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల ప్రత్యర్థులు ఎవరనే చర్చ సర్వత్రా కొనసాగుతోంది.

బీజేపీలో పోటీ అధికం..

◆ రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం తామేనని, కేసీఆర్‌ను ఓడించి తీరుతామని ప్రకటించుకుని కదనరంగంలోకి దిగిన బీజేపీ, కర్ణాటక ఎన్నికల తరువాత తమ దూకుడును ఒక్కసారిగా తగ్గించుకుంది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అనాధిగా పార్టీనే నమ్ముకుని ఉన్న టి.అంజన్‌కుమార్‌గౌడ్, డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డిలతో పాటు ఈ మధ్యకాలంలో పార్టీలో చేరి మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌గా గెలిచిన తోకల శ్రీనివాస్‌రెడ్డి, శంషాబాద్ మండలం నర్కుడకు చెందిన బుక్క గోపాల్‌లు ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్టును ఆశిస్తున్నారు. పార్టీ హైకమాండ్ మాత్రం వీరందరినీ కాదని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.



రాజేంద్రనగర్ నియోజకవర్గ మ్యాప్

ఎంఐఎం అభ్యర్థి లేనట్టేనా..?

◆ నియోజకవర్గంలో అత్యధికంగా 90వేల వరకు ముస్లింఓట్లు ఉండగా.. వారికి ప్రధానంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంఐఎం పార్టీ రాజేంద్రనగర్‌లో ఈసారి అభ్యర్థిని నిలపడనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. గతేదాది ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మిర్జా రహమత్‌బేగ్‌కు ఇటీవల అధికార బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుపలికి ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది. రెండు పార్టీల మధ్య రాజేంద్రనగర్ విషయంలో జరిగిన అవగాహనలో భాగంగానే అతడికి ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఎంఐఎం పార్టీ తరువాత ముస్లింలు అత్యధిక నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీకే ఓటు వేసేందుకు మొగ్గ చూపుతారనే చర్చలు కొనసాగుతున్నాయి. ఇది ఎమ్మెల్యేకు కలిసొచ్చే అవకాశం ఉందని ఆ పార్టీల నాయకులు చర్చించుకుంటున్నారు.

గత ఎన్నికల ఫలితాలు..

- ◆ 2009లో 42,037ఓట్లు, 2014లో 51,962 ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ నిలిచారు.
- ◆ 2018 ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా రాజేంద్రనగర్ సీటును టీడీపీకి ఇవ్వటంతో ఆ పార్టీ తరఫున పోటీ చేసిన ఆర్. గణేష్‌గుప్తాకు 50,591 ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్‌లో అవకాశం ఎవరికో...

◆ కాంగ్రెస్ పార్టీ నుంచి తానే అభ్యర్థినని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఇప్పటికే 'హాథ్ సే హాథ్ జోడో' కార్యక్రమాన్ని కొన్ని గ్రామాల్లో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నిర్వహించిన సర్వే ఆధారంగా ఎమ్మెల్యేకు సరైన ప్రత్యర్థిగా జ్ఞానేశ్వర్ నిలవలేదని వినికిడి. మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ముగ్గురిలో ఎవరికో ఒకరికి పార్టీ టికెట్టు ఇస్తుందా.. లేక ఇంకా మరెవరినైనా తెరపైకి తెస్తుందా.. అనే విషయం అధికారికంగా ప్రకటించాకనే తెలిసే అవకాశం ఉంది.

పర్యవేక్షణ లోపం.. పార్కులు అధ్వానం

పార్కుల అభివృద్ధి, వాటి నిర్వహణ బాధ్యతలు సైతం అధికారులు పరిశీలించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు విన్నవిస్తున్నారు. సుందరీకరణ బాధ్యత, గార్డుల ఏర్పాట్లు, ప్రహరీ లేకపోవడంతో అభివృద్ధి చేసినా.. పనికిరాకుండా పోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కులపై అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇబ్బందికరంగా మారుతున్నాయంటున్నారు.



పీరంచెరువులోని పార్కులో మూగజీవాలు ఇలా..



వాకర్స్‌కు ఇబ్బందులు..

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పీరంచెరువు పార్కును అధికారులు అభివృద్ధి చేయగా.. ఈ పార్కుకు ప్రహరీ లేదు. పార్కు నిర్వహణ చూసుకునేందుకు ఎలాంటి గార్డులు సైతం లేరు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు కార్మికులు లేరు. దీంతో స్థానికంగా ఉన్న మూగజీవాలు పార్కులోకి చేరుకుని నాటిన మొక్కలను మేస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీరంచెరువు పార్కులో మూగజీవాలు మేత మేస్తుండటంతో ఉదయం, సాయంత్రం సమయంలో పార్కులో వాకింగ్ చేసేందుకు వచ్చే వాకర్స్‌కు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పార్కుల సుందరీకరణతో పాటు వాటి నిర్వహణ బాధ్యతలు సైతం తీసుకోవాలని స్థానికులు వెల్లడిస్తున్నారు.